క్లుప్తంగా

ఆంధ్ర సరిహద్దుకు చేరిన దిగువ కాలువ నీరు



గంగమ్మకు పూజలు చేస్తున్న అధికారులు

హాలహర్వి: కర్నూలు జిల్లాకు తాగునీటి అవసరాల కోసం తుంగభద్ర జలాశయం నుంచి 300 క్యూసెక్కుల నీటిని ఈనెల 14వ తేదీన బోర్డు అధికారులు విడుదల చేశారు. దీంతో ఆంధ్ర సరిహద్దు అయిన మండలంలోని చింతకుంట వద్దకు ఆదివారం ఉదయం నీరు చేరుకున్నాయి. దీంతో కాలువ ఆఫీసర్లు, ఎస్డీఓ హసన్‌బాషా, జేఈలు దుర్గావరప్రసాద్, శ్రీకాంత్, మహేశ్వర్‌రెడ్డి, కాలువ సిబ్బంది, కాల్వ సెక్యూరిటీ గార్డులు, స్థానికులు దిగువ కాలువల వద్దకు చేరుకుని గంగమ్మకు పూజలు చేశారు. కాలువకు నీరు రావడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కర్నూలు(అగ్రికల్చర్): ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలని జిల్లా జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జాతీయ పశువైద్య సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం జిల్లా పశువైద్య అధికారుల సంఘం, జిల్లా పశువైద్య సహాయ శస్త్రచికిత్సకుల సంఘం ఆధ్వర్యంలో కొండారెడ్డిబురుజు, బహుళార్థ పశువైద్యశాలలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. జేడీ జి.శ్రీనివాస్ దంపతులతో పాటు డీడీలు, ఏడీలు, పశువైద్యులు పాల్గొని మొక్కలు నాటారు.

గణేష్ ఉత్సవాల్లో మట్టి విగ్రహాలనే పూజిద్దాం

కర్నూలు కల్చరల్: గణేష్ మహోత్సవాల్లో మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పూజలు చేద్దామని శ్రీ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి ఉత్సవాల్లో స్థానిక ఉత్సవ కమిటీలు మట్టి విగ్రహాలనే ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్నామన్నారు. కర్నూలు నగరంలో విపరీతంగా పెరిగిపోతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రతిఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. నగర శివారు డోన్ రోడ్డులోని వెంగన్న బావి సమీపంలో మట్టి వినాయక విగ్రహాల తయారీ కేంద్రం ఉందని, విగ్రహాలు కావాల్సిన వారు యజమాని కెనరాం పాల్ 95359 19826 ను సంప్రదించవచ్చని సూచించారు.

సంస్కృతిని భావితరాలకు అందించాలి

కర్నూలు కల్చరల్: మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభు అన్నారు. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని శ్రీ పూరీజగన్నాథ మందిరంలో ఆదివారం వ్యాసపూర్ణిమ, నగర సంకీర్తన, భగవద్గీత శిక్షణా తరగతులు జరిగాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హరినామ సంకీర్తన, రాజభోగ హారతి, ఆశీర్వాదం, మహాప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కర్నూలు (టౌన్): కర్నూలు మండలం భూపాల్‌నగర్‌లో నివసించే వివాహిత ఆత్మహత్య చేసుకుంది. స్థానికంగా కాలనీలో మౌనిక, దుర్గాప్రసాద్ అనే ఇరువురు ప్రేమించుకొని పెళ్లి చేసుకున్నారు. భర్త కూలీ పనిచేసేవాడు. భార్య ఇంటి వద్దనే ఉంటుంది. వీరికి ఒక కుమార్తె ఉంది. ఇదిలాఉండగా ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మౌనిక (25) ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు భర్తకు సమాచారం ఇచ్చారు. అతడు హుటాహుటిన ఇంటికి చేరుకోగా అప్పటికే భార్య మృతి చెందింది. ఘటనపై కర్నూలు తాలుకా పోలీసులకు సమాచారం తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

కురువలకు పదవులు కల్పించాలి

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో త్వరలో భర్తీ చేయనున్న నామినేటెడ్ పదవుల్లో టీడీపీని నమ్ముకొని కష్టపడి పనిచేసిన కురువ సామాజిక వర్గానికి చెందిన వారికి ప్రాధాన్యత కల్పించాలని జిల్లా కురువ సంఘం నేతలు కోరారు. జిల్లాకు చెందిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీ.శ్రీలీలమ్మ తదితరులు ఆదివారం రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవితమ్మను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నామినేటెడ్ పదవుల భర్తీలో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారన్నారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు టీ విజయలక్ష్మి, ధనుంజయ, దేవేంద్ర, తవుడు శ్రీనివాసులు, కే వెంకటేశ్వర్లు, నాగేషులు, కే మహేష్ ఉన్నారు.

సాగు సాయం ఏదీ ?

- నేటికీ అన్నదాతకు పెట్టుబడి సాయం అందించని టీడీపీ ప్రభుత్వం
- ఏటా రూ.20వేలు అందిస్తామన్న బాబు... ఇప్పటికీ కనీసం స్పష్టత ఇవ్వని వైనం
- చంద్రబాబు మళ్లీ మభ్యపెట్టారంటూ నిట్టూర్పుతున్న రైతులు
- ఖరీఫ్ పంటల సాగుకు తప్పని అప్పులు



గడివేముల సమీప పొలంలో వరి నాట్లు వేస్తున్న మహిళలు

గడివేముల: ఖరీఫ్ సీజన్ జూన్ 1వ తేదీన ప్రారంభమైంది. అంటే ఏడువారాలు దాటింది. అయినా అన్నదాతకు పెట్టుబడి సాయం అందని పరిస్థితి. గత సార్వత్రిక ఎన్నికల ముందు సీజన్‌కు ముందే రూ.20 వేలు అందిస్తామన్న చంద్రబాబు హామీ నీటిమీద రాతగా మారిపోయింది. ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించి గద్దెనెక్కిన చంద్రబాబు...రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ఏ మాత్రం దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఖరీఫ్ సాగు పెట్టుబడులకు రైతాంగం ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. పీఎం కిసాన్ యోజన కింద కేంద్రం నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినా టీడీపీ ప్రభుత్వం మాత్రం ఇప్పటికీ మీనమేషాలు లెక్కిస్తోంది. రైతు భరోసా పథకం పేరును అన్నదాత సుఖీభవ అని మార్చడం తప్పా చేసిందేమీ లేదని రైతులు నిట్టూర్చుతున్నారు. పథకం అమలుపై కనీసం స్పష్టత కూడా ఇవ్వకుండా అయోమయానికి గురి చేస్తోందని టీడీపీ ప్రభుత్వం విమర్శలు గుప్పిస్తున్నారు రైతులు. అప్పులు చేసి ఖరీఫ్ సాగు చేస్తున్నారు. గోనెగొండ్ల మండలం మొత్తం సాగు విస్తీర్ణం 32 వేల ఎకరాలు ఉండగా ఖరీఫ్‌లో దాదాపు 19 వేల ఎకరాలలో వివిధ పంటలు సాగు చేస్తారు. ఇప్పటికే పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, మినుము తదితర పంటలు సాగు చేశారు. నీటి వనరుల కింద ప్రస్తుతం వరి నాట్లు వేస్తున్నారు.

అన్నదాతకు అప్పులే గతి..!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా సీజన్ ఆరంభంలోనే రైతు భరోసా పథకం నిధులను అన్నదాతలకు అందించేది. ఈ ఏడాది కూడా మేలోనే రూ.5,500 చొప్పున రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాల్సి ఉంది. అయితే సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో నిధుల విడుదల నిలిచిపోయింది. ఈ క్రమంలో ఇటీవల విడుదలైన పీఎం కిసాన్ నగదు రైతులకు దుక్కులకు ఉపయోగపడింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సాయం అందిస్తే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులకు వాడుకోవాల్సి ఉంటుంది. కానీ టీడీపీ సర్కార్ స్పందించకపోవడంతో రైతులు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

పంట రుణాలకు పాట్లు..!

టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులు పంట రుణాలను బ్యాంకుల్లో పొందలేని పరిస్థితి వచ్చింది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ఆమోదించడంలో జాప్యం కారణంగా పాత రుణాలను రెన్యూవల్ చేయడం మినహా కొత్తగా రుణాలు మంజూరు కావడంలేదు. దీంతో సేద్యం పనుల కోసం ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. అధిక వడ్డీల భారం మోయాల్సిన దుస్థితి దాపురించింది. ఇంట్లో బంగారు నగలను తాకట్టు పెట్టుకుని వ్యవసాయ పనులు సాగించాల్సి వస్తోంది.

జగనన్న ప్రభుత్వంలో సీజన్ ఆరంభంలోనే సాయం

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది. రైతు భరోసా పథకాన్ని పకడ్బందీగా అమలు చేసింది. సాగు పెట్టుబడి ఖర్చులకు అన్నదాతలు ఏమాత్రం ఇబ్బంది పడకూడదని చిత్త శుద్ధితో సాయం అందించింది. పీఎం కిసాన్ కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 కలిపి ఏడాదికి రూ.13,500 మూడు విడతలుగా సీజన్ ఆరంభంలోనే బ్యాంక్ ఖాతాల్లో జగనన్న ప్రభుత్వం జమ చేసిన తీరును రైతులు గుర్తు చేసుకుంటున్నారు. చంద్రబాబు మభ్యపెట్టారంటూ రైతులు నిట్టూర్చుతున్నారు.

అప్పు చేయాల్సి వచ్చింది



నాకు ఆరు ఎకరాల భూమి ఉంది. దీంతో పాటు పదెకరాల కౌలుకు తీసుకుని వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నాను. సాగు ఖర్చులు ఇబ్బందిగా మారాయి. గతంలో పీఎం కిసాన్, రైతు భరోసా పథకాల కింద వ్యవసాయానికి పెట్టుబడి సాయం అందేది. అప్పులు చేయాల్సిన అవసరం ఉండేది కాదు. ఇప్పుడు అప్పు చేసి పంట సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సకాలంలో పెట్టుబడి సాయం అందజేస్తేనే ఉపయోగం.

– చిన్నషాలు, రైతు, బూజునూరు

ఇబ్బంది లేకుండా చూడాలి



నాకు మూడు ఎకరాల భూమి ఉంది. మొదట సోయాబీన్ సాగు చేశాం. సాగు ఖర్చులు పెరిగాయి. గత ప్రభుత్వం సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం ఇచ్చేది. ఉచిత పంటల బీమాను అమలు చేసేది. కొత్త ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి. రైతులకు వ్యవసాయ పనులు చేసుకునేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలి. టీడీపీ ప్రభుత్వం ఇప్పటికైనా పెట్టుబడి సాయం వెంటనే అందజేయాలి.

–ఉశేన్‌బాషా, రైతు, గడిగరేవుల గ్రామం

ఎన్నికల హామీని నెరవేర్చాలి



గత ఎన్నికల సమయంలో ఇచ్చిన టీడీపీ ఇచ్చిన హామీ వెంటనే నెరవేర్చాలన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.20 వేల పంటలు సాగు చేసే సమయంలో అందజేస్తామని హామీ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండునెలలు కావస్తున్నా పెట్టుబడి సాయం ఇవ్వకపోవడం సమంజసం కాదు. గత ప్రభుత్వంలో సీజన్ ప్రారంభంలోనే రైతుభరోసా డబ్బులు నేరుగా మా అకౌంట్లలో పడేది. –నిరంజన్‌రెడ్డి, పెసరవాయి

నదీతీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సి.బెళగల్: తుంగభద్ర నదీతీర గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ శకుంతల ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. నదీతీర గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి, నది వరదనీటితో తలెత్తే ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. హోస్పేట్ డ్యామ్‌కు ఎగువ నుంచి పెద్ద ఎత్తున ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుందని, దీనితో డ్యామ్ గేట్లు ఎత్తి నది దిగువకు వరదనీటిని ఏక్షణమైన వదిలే అవకాశం ఉందని, నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా తిమ్మందొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, ముడుమాల, ఈర్లదిన్నె, కె.సింగవరం, కొత్తకోట గ్రామాల సర్పంచ్‌లు రైతాంగంకు నదికి వచ్చే వరదనీటి ప్రవాహంపై అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు వ్యవసాయ మోటర్లను, పైపులైన్లను మార్చుకునే ముందు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ సూచించారు.

పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) కృష్ణమూర్తి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అయితే వర్షాల కారణంగా భక్తుల రద్దీ కొంతమేర తగ్గిందని అధికారులు తెలిపారు. స్వామివారికి దాదాపు రెండు వందల అభిషేకాలు జరిగాయన్నారు. స్వామి దర్శనం అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యార్థినుల సమస్యలు పరిష్కరించండి



హాస్టల్ ప్రాంగణంలో మాట్లాడుతున్న నాగన్న

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లులోని ఎస్సీ బాలికల వసతి గృహంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా వ్యయసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. ఆదివారం బాలికల వసతి గృహాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ హాస్టల్ ప్రాంగణంలో బురదమయంగా మారిందన్నారు. దీంతో విద్యార్థినులు వర్షాకాలంలో బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. అలాగే హైస్కూల్ ప్రహరీ గోడ కూలిపోవడంతో హాస్టల్ విద్యార్థినుల స్నానపు గదులు కనిస్తున్నాయని, విద్యార్థినులు అసౌకర్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థినులకు అనుగుణంగా అదనపు గదులు నిర్మించాలని, లేని పక్షంలో పిల్లల తల్లితండ్రులతో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు ఎల్లరాజు, ఈశ్వర్, చంద్ర, శ్రీరాములు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తిమ్మన్న

కోడుమూరు రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా 15లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు వెంటనే 30శాతం ఫిట్‌మెంట్‌తో 12వ వేతన సవరణ అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోడుమూరులో ఆదివారం నిర్వహించిన ఎస్టీయూ తాలుకా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ డీఏ మంజూరు చేయడంతో పాటు, జీఓ నంబర్ 117 రద్దు చేయాలన్నారు. విలీనమైన తరగతులను మాతృ పాఠశాలలకు మళ్లించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించి, పాఠశాల విద్యలో సమాంతర తెలుగు మీడియాన్ని కొనసాగిస్తూ, మాతృభాషా బోధనను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ కోడుమూరు మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, స్థానిక నాయకులు విక్టర్, వెంకటేశ్వర్లు, ఈరన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఉద్యోగికి గాయాలు



చికిత్స పొందుతున్న శ్రీనివాసులు

పాణ్యం: ట్రాన్స్‌కోలో పోల్‌టూపోల్ వర్కర్‌గా పని చేస్తున్న శ్రీనివాసులు షార్ట్‌సర్క్యూట్‌కు గురయ్యారు. సిబ్బంది తెలిపిన వివరాల మేరకు..ఆదివారం పిన్నాపురం గ్రామంలో విద్యుత్ సమస్య ఉండటంతో శ్రీనివాసులు స్తంభం ఎక్కారన్నారు. ప్రమాదవశాత్తు షాక్ కొట్టి కిందపడ్డాడు. సిబ్బంది 108 వాహనంలో శాంతిరాం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి తరలిచారు. పరీక్షించిన డాక్టర్లు తలకు తీవ్రగాయం, పొట్ట సమీపంలోని ఎముకలకు గాయాలయ్యాయని చెప్పారు. విషయం తెలుసుకున్న అధికారులు జరిగిన ఘటనపై ఆరా తీస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు

- ప్రజలను అప్రమత్తం చేయండి
- వైద్య, ఆరోగ్య సిబ్బందికి ఆదేశం
- అస్వస్థతతో మృతిచెందిన బాలుడి కుటుంబాన్ని పరామర్శించిన డీఎంహెచ్ఓం ప్రవీణ్ కుమార్

సాక్షి ఎఫెక్ట్

ఓర్వకల్లు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్య, ఆరోగ్య సిబ్బందిని డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించి చైతన్య పరచాలని సూచించారు. ఈ నెల 20వ తేదీన సాక్షి దినపత్రికలో 'మురుగు'తున్న పల్లెలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు, పంచాయతీరాజ్ శాఖాధికారులు ఆదివారం మండలంలోని కన్నమడకలలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా గ్రామ శివారులోని జగనన్న కాలనీలో నివసిస్తూ రెండు రోజుల క్రితం అస్వస్థతతో మృతి చెందిన సాగర్ కుటుంబ సభ్యులను డీఎంఅండ్‌హెచ్ఓ పరామర్శించారు. మృతికి గల కారణాలపై ఆరాతీశారు. కాలనీలో పారిశుద్ధ్యం, తాగునీటి వసతులను పరిశీలించారు. అనంతరం కొత్త బిల్డింగులలో నెలకొన్న పారిశుద్ధ్యం, మురుగు కాల్వలు, మంచినీటి ట్యాంక్‌లను పరిశీలించారు. వర్షాకాలంలో సోకే వ్యాధులలో ప్రధానంగా అతిసార, మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికెన్‌గున్యా తదితర వ్యాధుల వ్యాప్తి గూర్చి అధికారులు వివరించారు. ఈ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్ఓ అధికారులు, సిబ్బందికి సూచించారు. వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించేలా ప్రజలను చైతన్య పరచాలన్నారు. కాచిచల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. ఇళ్ల ముందు ఉన్న కాల్వల్లో మురుగును తొలగించి, బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలని, 15 రోజుల ఒకసారి ట్యాంకులను శుభ్రంచేసి, క్లోరినేషన్ చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ట్యాంక్‌ల ద్వారా సరఫరా చేసే నీటిలో ఎలాంటి వైరస్ ప్రభావిత లక్షణాలు కనిపించలేదని పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ధృవీకరించారు.



మృతి చెందిన బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ ప్రవీణ్‌కుమార్

వైద్యులను విచారించిన అధికారులు

రెండు రోజుల క్రితం అస్వస్థతతో మృతి చెందిన బాలుడి సంఘటనపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.ప్రవీణ్‌కుమార్, డివిజనల్ పంచాయతీ అధికారిణి తిమ్మక్క స్థానిక వైద్యాధికారి డా.మంజులను విచారించారు. అస్వస్థతకు గురైన బాలుడిని ఆసుపత్రికి తీసుకొచ్చిన విషయం వాస్తవమే అని డాక్టర్ మంజుల తెలిపారు. అయితే వాంతులు విరేచనాలు రావడంతో బాలుడి వైద్య చికిత్సలు చేశామని, అయితే అప్పటికే ఆరోగ్య పరిస్థితి పూర్తిగా క్షీణించిందన్నారు. స్పృహకోల్పోయి బాలుడు మృతి చెందినట్లు ఆమె వివరించారు.



జేసీబీతో చెత్తకుప్పలను తొలగిస్తున్న గ్రామ సర్పంచ్ కాశీం



మురుగు కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న కార్మికులు

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

అస్తవ్యస్తంగా మారిన పారిశుద్ధ్యం పనులపై ఒకరోజు ముందుగానే సాక్షి దినపత్రికలో ప్రచురితం కావడంతో, జిల్లా అధికార యంత్రాంగం గ్రామానికి వస్తున్న విషయాన్ని తెలుసుకొని గ్రామ సర్పంచ్ పెద్ద కాశీం అప్రమత్తమయ్యాడు. పారిశుద్ధ్య కార్మికులతో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులను చేయించారు. గ్రామంలో పలు చోట్ల పేరుకపోయిన బురదను, చెత్తాచెదారాన్ని జేసీబీ సాయంతో తొలగించి శుభ్రంచేయించారు. కాల్వల్లో మురుగును తొలగిలించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. వీధులల్లో గడ్డిమందును చల్లించారు. మంచినీటి ట్యాంకు వద్ద అస్తవ్యస్తంగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో డీఎస్ఓ నాగప్రసాద్, హుసేనాపురం వైద్యాధికారిని డా.రేఖ, ఎంపీడీఓ మల్లీశ్వరి, ఈఓఆర్డీ సుబ్బరాయుడు, పంచాయితీ కార్యదర్శి రామరాజు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సాయిబాబాకు భక్తుల ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



సాయిబాబా ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

కోడుమూరు రూరల్: గురుపౌర్ణమి పురస్కరించుకుని ఆదివారం మండల ప్రజలు సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. కోడుమూరులోని కోటవీధి, ప్యాలకుర్తి, పులకుర్తి గ్రామాల్లో వెలసిన సాయిబాబా దేవాలయాలకు ఉదయం నుంచే భక్తులు భారీ సంఖ్యలో పోటెత్తారు. సాయినాధునికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయి భక్త బృందం సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం నాయీబ్రాహ్మణ సేవా సమితి సభ్యులు సాయిబాబా చిత్రపటాన్ని పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు.

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో ఆదివారం గురు పూర్ణిమ వేడుకలను శ్రీ సాయి భక్తులు వైభవంగా నిర్వహించుకున్నారు. గ్రామంలో సాయినాథుడి విగ్రహం ప్రతిష్ఠించుకుని రెండు సంవత్సరాలు పూర్తి అవుతుండటంతో పాటు, గురు పూర్ణిమ కావడంతో భక్తులు పెద్ద ఎత్తున అభిషేకాలు, ప్రత్యేకా పూజలు చేశారు.

పాణ్యం: మండలంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రమైన పాణ్యం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న సాయిబాబ ఆలయంలో అర్చకులు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో సాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

గడివేముల: మండలంలో ఆదివారం గురువారం పౌర్ణమి సందర్భంగా భక్తులు సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రం గడివేములతో పాటు చిందుకూరు గ్రామంలోని సాయిబాబ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే సాయిబాబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబకు హారతి, సుప్రభాతం, అభిషేకం నిర్వహించారు.



అన్నదానం స్వీకరిస్తున్న భక్తులు



గురు పూర్ణిమ పూజా అర్చనలలో సాయి భక్తులు



బాబాకు పూజలు చేస్తున్న మహిళలు



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



కొర్రపొలూరు రోడ్డు దుస్థితి ఇది....

రోడ్డు గుంతలమయం

గడివేముల: మండల పరిధిలోని వెలుగోడు నుంచి కొర్రపొలూరు రహదారి గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కనీసం రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే రోడ్డు బురదమయం అవుతుంది. మరికొన్నిచోట్లు రోడ్డుపై చేరిన నీరు కుంటలను తలపిస్తుంది. ఏది గుంతో.. ఏది రోడ్డు సమాంతరమో తెలియని పరిస్థితి. వాహనచోదకులు గుంతలో పడి ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు కోకొల్లలు. రాత్రి వేళల్లో ఈ రోడ్డులో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సిందే. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.